యుపిఎస్‌సి పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

యుపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బిసి సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.లల్లి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 03వ తేదీ లోపల కాకినాడ డిఆర్‌డిఎ కాంప్లెక్స్‌లోని ప్రగతి భవనం రెండో అంతస్తులోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని పేర్కొన్నారు. డిసెంబర్ 7, 2025 తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఇందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యాలయంలో లేదా 0884-2379216, 8008121321, 8985899221 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరికి మళ్లీ తుపాను గండం

- వాతావరణ శాఖ హెచ్చరికలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- మొంథా నష్టం నుంచి తేరుకొని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మరో తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడడంతో శనివారం నుంచి మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో రైతులు కలవర పడుతున్నారు. తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురియడంతో పాటు ఈదురు గాలులు కూడా వీస్తాయని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట చేతికందే చివరి దశలో మరోసారి నష్టం తప్పదా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మొంథా తుపానుతో అతలాకుతలమైన జిల్లా రైతాంగం నష్టాల నుంచి ఇంకా తేలుకోలేదు. ఇప్పుడు మళ్లీ మరో తుపాను గండం పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్న తరుణంలో ఏం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 2.10 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండించారు. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. యంత్రాల ద్వారా రైతులు పంటను శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం 60 శాతానికి పైనే కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నైరుతి బంగాళాఖాతంలో హిందూ మహాసముద్రం, శ్రీలంక సమీపంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకతమై ఇది క్రమంగా బలపడుతూ వాయుగుండంగా మారే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతోంది. అన్ని పరిస్థితులూ అనుకూలిస్తే మంచి దిగుబడులు సాధించాలని ఆశిస్తున్న రైతాంగానికి మరో తుపాను హెచ్చరిక ఆశనిపాతంలా మారనుందనే

రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

ఆందోళన వారిలో నెలకొంది.

మొంథా నష్టం నుంచి తేరుకోకముందే...

ఇటీవల మొంథా తుఫాను ప్రభావం వల్ల జిల్లాలో వేలాది మంది రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. సుమారు 40 వేల మంది రైతులకు చెందిన దాదాపు 60 వేల ఎకరాల్లో వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. దీంతోపాటు మరో 2 వేల ఎకరాల్లో పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. తిరిగి కోలుకోలేని విధంగా రైతులు పీకల్లోతు కష్టాల్లో కురుకుపోయారు. అనేకమందికి పంటలో ఒక గింజ కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా చేతికి అందకుండా తుపాను ముంచేయడంతో అనేకమంది అన్నదాతలు తీవ్రంగా సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టం అంచనాలను తక్కువగా చూపించడంతో పలువురు కన్నీరు పెడుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువగా నష్టం జరిగితేనే పంట నష్టపరిహారం జాబితాలో చోటు దక్కుతుందనే నిబంధన వల్ల అనేకమందికి పరిహారం దక్కే పరిస్థితి కనిపించడం లేదు. తుపాను వచ్చి నెల రోజులు దాటుతున్నా రైతులకు నేటికీ కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు.

నష్టం నుంచి తీరుకోక ముందే..

గడచిన తుపాను నష్టం నుంచి అన్నదాతలు, కోస్తా తీర ప్రాంత మత్స్యకారులు ఇంకా తేరుకోలేదు. ఈ తరుణంలోనే మరో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు మరోసారి ఆందోళన చెందుతున్న పరిస్థితి ఏర్పడింది. మొంథా తుపాను సమయంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హడావిడి చేసారు. అనుకున్నంత స్థాయిలో ఆ తుపాను తీవ్రత కనిపించలేదు. యంత్రాంగం మాత్రం పెద్ద ఎత్తున హడావిడి చేసింది కానీ పూర్తిస్థాయిలో సహాయక కార్యక్రమాలను నిర్వహించడంలో పెద్దగా శ్రద్ధ చూపలేకపోయింది. ముఖ్యంగా వరి రైతుల నష్టపరిహారం విషయంలో చాలామందికి తగిన న్యాయం జరగలేదు. మత్స్యకారులు ఉపాధి లేకుండా వారం రోజులపాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి తూతూ మంత్రంగా 50 కిలోల బియ్యం, కొన్ని రకాల కూరగాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపించాయి. ఇప్పుడు మరోసారి తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈసారైనా అధికారి యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమై రైతులను, మత్స్యకారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం వరి కోతలు యంత్రాల సాయంతో రైతులు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించడంలో కొంత జాప్యం చోటు చేసుకుంటోంది. తేమశాతం నిబంధన పేరుతో అధికారులు రైతుల నుంచి సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ధరకే దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్న పరిస్థితి ఏర్పడింది. నిబంధనల వల్ల ఆరబెట్టుకునేందుకు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో వచ్చే తుపానుని దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జిజిహెచ్‌లో సౌకర్యాలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు పెంచాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆసుపత్రిలో పర్యటించారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి మాట్లాడుతూ ఆసుపత్రిలో సౌకర్యాలు కరువయ్యాయన్నారు. ఎమర్జెన్సీ పేషెంట్లకు ప్రాథమిక చికిత్స అందించే క్రమంలో ఒక మంచానికి ఇద్దరూ లేక ముగ్గురిని ఉండమంటున్నారని ఇది చాలా దారుణమైన పరిస్థితి అని వాపోయారు. గతంలో గర్భిణులను కూడా మంచానికి ఇద్దరు చొప్పున ఉంచేవారని తెలిపారు. ఇటీవల గర్భిణులు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచీ సామాన్య ప్రజలు వైద్యం నిమిత్తం రోజూ వందలాదిమంది వస్తారని వారు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల, పట్టణ ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని ప్రజలకు అందుబాటులో ఉండేలా సౌకర్యాలు కల్పిస్తే

జిజిహెచ్‌లో పర్యటిస్తున్న ఐద్వా బృందం

కాకినాడ వరకూ రావాల్సిన అవసరం ఉండదని దాని వల్ల ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. సిబ్బందిని పెంచాలని, దీనికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. ఆసుపత్రులకు తక్కువ బడ్జెట్ ఖర్చు పెట్టడం వల్ల యంత్ర పరికరాలు, ఇతర సౌకర్యాలు లేక సిబ్బంది కొరత కారణాల వలన పేద మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి.భూలక్ష్మి, సిహెచ్ కిరణ్మయి, గౌరి, పద్మావతి పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్స్‌లో మెరుగైన సదుపాయాలు కల్పనకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా సంక్షేమ శాఖల అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాల సక్రమ నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వసతి గృహాల నిర్వహణలో పొరపాట్లకు ఇతర అవకతవకలకు ఎటువంటి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గహాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ యాప్ నిర్వహణపై వసతి గృహాల అధికారులు సిబ్బంది అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

పెంపొందించుకోవాలన్నారు. బాలికలను వసతి గృహాల నుంచి తీసుకువెళ్లడానికి వచ్చే తల్లిదండ్రులు, గార్డియన్‌స ఫోటోలు ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో అతికించి, వివరాలు ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ శోభారాణి, బిసి సంక్షేమాధికారి ఎం.లల్లి, గిరిజన సంక్షేమ అధికారి ఎన్.నాగమల్లేశ్వరరావు, డిపిఒ వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థి దశ నుంచి వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ విజయాన్ని ఒక అలవాటుగా మార్చుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. జిల్లా నుంచి మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాక్ అసెంబ్లీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు నాణ్యమైన విద్య ఇతర నైపుణ్యాలు అందించడంతో పాటు సమాజం పట్ల అవగాహన కల్పించే

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - సామర్లకోట

అత్యంత అరుదైన డెవలప్మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ సమస్యతో బాధ పడుతున్న రోగికి మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆధునిక సాంకేతికతతో తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పనసపాడులోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్య బృందం ఈ విషయాన్ని వివరించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం, కింద్ర గ్రామానికి చెందిన ఎ.సత్యనారాయణ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్రమైన నొప్పితో నడవలేని స్థితికి చేరుకున్నారు. చికిత్స కోసం మెడికవర్ హాస్పిటల్స్‌ను ఆశ్రయించిన ఆయనను ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అరుణ్ కుమార్ పరీక్షించారు. రోగికి పుట్టుకతోనే డిడిహెచ్ సమస్య ఉండటంతో పాటు ప్రమాదంలో తుంటి ఎముకకు తీవ్ర గాయమైన విషయం గుర్తించారు. వెంటనే తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. అరుణ్ కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ మాధవరావు, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ అరవింద్‌తో కలిసి శస్త్రచికిత్స చేశారు.

2న గొల్లప్రోలు మండల సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

డిసెంబర్ 2న మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ నీతిపూడి సెలెట్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరవ్వాలని ఎంపిడిఒ కోరారు.

కార్టూ'నిజం'



మహాత్మా జ్యోతీరావు ఫూలేకు ఘన నివాళి

మహాత్మా జ్యోతిరావు ఫూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు జిల్లావ్యాప్తంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ మహాత్మా జ్యోతీరావు ఫూలే స్ఫూర్తితో అందరికీ విద్య, సామాజిక న్యాయం సాధించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ సెంటర్‌లో పూలే విగ్రహానికి అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, జిజిహెచ్ ఎదురుగా ఉన్న విగ్రహానికి పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నులుకుర్తి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, జి.సత్యానందం, చంద్రమళ్ల పద్మ, టేకుమూడి ఈశ్వరరావు, డి.ఆదర్శ్, టి.రాణి, డి.శారద, వెంకట్రావు, లోవరాజు పాల్గొన్నారు.

తాళ్లరేవులో ఫూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

గొల్లప్రోలు ఎంపిడిఒ నీతిపూడి సెలెట్ రాజు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వి.సాగర్ కుమార్, నూకరాజు, పెదకాపు, గంగాధర్ పాల్గొన్నారు.

జగ్గంపేట జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల వద్ద పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్త కొండబాబు, పులి ప్రసాద్, మాదారపు వీరబాబు, కురుమళ్ల నాగేశ్వరరావు, గంధం శ్రీను, పాల్గొన్నారు.

కాకినాడలో పూలేకు నివాలర్పిస్తున్న నాయకులు

తాళ్లరేవు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో పూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టడీ సర్కిల్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు, వాకపల్లి అప్పారావు, తరాల మీరాసాహెబ్, అత్తిలి బాబూరావు, ఎలిపే నాగేశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, గంటా దిలీప్, నల్లి ఈశ్వరరావు, బొంతు మోహన్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు మాట్లాడారు. వాసంశెట్టి శ్రీనివాస్, మేడిశెట్టి నారాయణరావు, ఖండేపల్లి శ్రీనివాస్, నేరేడిమిల్లి త్రిమూర్తులు, పోతురాజు నాగరాజు, నేల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్‌ను సత్కరిస్తున్న డిఎస్‌పి శ్రీహరిరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు

నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్స్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్స్ దివాకర్, మణికంఠలను డిఎస్‌పి శ్రీహరి రాజు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం పెద్దాపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వారిని అభినందించారు. వీరిని సామర్లకోటకు చెందిన శ్రీభీమేశ్వర లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐ విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామర్లకోట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తెలిపారు. గత నెల 31న వాయిదా పడిన జెండాలోని అంశాలతో పాటు మొత్తం 47 అంశాలతో కూడిన అజెండాను సభ్యులకు పంపించారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పేరుతో మెజారిటీ వైసిపి సభ్యులు గత నెల సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే అభివద్ధిని అడ్డుకుంటున్నారన్న విమర్శల నేపథ్యంలో శనివారం జరిగే కౌన్సిల్ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని చైర్‌పర్సన్ అరుణ కోరారు

నేడు సామర్లకోట మండల సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొబ్బర సత్తిబాబు అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సమావేశంలో బడ్జెట్ అంచనాలు సవరణ బడ్జెట్‌పై చర్చ అనంతరం వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష ఉంటాయని వివరించారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యంలో స్థానిక పిఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించడానికి రూపొందించిన చట్టం అన్నారు. ఈ చట్టం 18 ఏళ్ల లోపు పిల్లలందరినీ లైంగిక వేధింపులు, లైంగిక దాడి, లైంగిక దోపిడీ నుంచి రక్షిస్తుందన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడి, అశ్లీలత వంటి తీవ్రమైన నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. లైంగిక నేరాలను బట్టి ఈ చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయన్నారు. తీవ్రమైన లైంగిక దాడి కేసులో దోషికి కనీసం 10 ఏళ్ల నుంచి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు, జీవిత ఖైదు వరకూ శిక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఆకతాయిల మాటలకు, ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన, బహుమతులు ఇచ్చిన తీసుకోరాదని సూచించారు. ప్రేమ పేరుతో వేధింపులు, లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా పోలీస్ 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ

సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు

కార్యక్రమంలో ఎన్‌వి.లక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

మెగా దంత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-పిఠాపురం

రాజుగారి కోటలోని రెడ్డి రాజా కళ్యాణ మండపంలో జిఎస్‌ఎల్ ఆసుపత్రి, నియో మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవార ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. దంత వైద్యం చేయించుకోవడానికి ఖర్చు ఎక్కువ అవుతుందని, ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు ఉచితంగా అందజేయడం మంచి కార్యక్రమన్నారు. నియో మెడికల్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్, షి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బుర్ర దివ్యరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుర్ర కష్ణంరాజు, జిఎస్‌ఎల్ ఎండి జి.సందీప్, నియో సీఈవో రోషన్, జిఎస్‌ఎల్ సిఇఒ గోవిందరాజు, ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఊటా నాని బాబు, పెంకే జగదీష్ పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సమాఖ్య సభ్యులు

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మహిళల ఆర్థిక స్వావలంబన సాధించడానికి కృషి చేసే విధంగా వార్షిక ప్రణాళిక ఉండాలని ఎపిఎం కెవికె.శైలేష్ అన్నారు. మండలంలోని గ్రామ మహిళ సమాఖ్య వార్షిక ప్రణాళికకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో కసరత్తు నిర్వహిస్తున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్లకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో మూడో రోజు శుక్రవారం ఎపిఎం కెవికె శైలేష్ వార్షిక ప్రణాళికపై పలు సూచనలు చేశారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాలను ప్రామాణికంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించడానికి అనుగుణంగా ప్రణాళికలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా తయారు చేసిన ప్రణాళికను మహిళలు సమావేశంలో వివరించారు. అనంతరం లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా సమాఖ్య ప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు జల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

24 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు జనవరి 24 నుంచి 26వ తేదీ వరకు చంద్రమాంపల్లిలో నిర్వహిస్తామని నాటిక పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. శుక్రవారం చంద్రమాంపల్లిలో ఈ నాటిక పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తూ 7వ సంవత్సరంలోకి అడుగు పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందన బ్రహ్మానందం, కేదారి నాగు, దేవాడ పాపేశ్వరావు, మంతెన సత్తిబాబు, వెన్నా పండు, నూకల మంతి నానాజీ, కంటి బోయిన ప్రసాద్, ద్వారంపూడి చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితులతో పోలీసులు

131 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

బొలెరో వ్యాన్‌లో తరలిస్తున్న రూ. 65,73,500 విలువ చేసే 131.47 కేజీల గంజాయిని నల్లజర్ల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంజాయి రవాణాపై నల్లజర్ల ఎస్ఐకు ముందస్తు సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల గ్రామం వైపు వస్తున్న బొలెరో వ్యాన్‌లో ఆరు ప్లాస్టిక్ సంచులను గుర్తించారు. తనిఖీ చేయగా ఇందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లి పంచాయతీ పరిధిలోని మారేటిపల్లికి చెందిన డ్రైవర్ తలారి ఆనంద్, మరో వ్యక్తి పూల మనోహర్‌ను అరెస్టు చేశారు. వారిని విచారణ చేయగా కేడి పేట అవతల ఉన్న కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి తీసుకొస్తున్నట్ట తెలిపారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు పూల మనోహర్‌పై గతంలో ఐదు గంజాయి అక్రమ రవాణాకి సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్, నల్లజర్ల సిఐ వై.రాంబాబు, ఎస్ఐ కె.దుర్గాప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

తగాదాలో వ్యక్తి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి హఠాత్తుగా కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం తాటిపర్తిలో చోటు చేసుకుంది. బంగారుపేటలో శ్రీమంతుడు కుమార్తె పుట్టినరోజు ఏర్పాట్లకు ఇంటి పక్కన రహదారి మీద పొయ్యి పెట్టి ఎవరో ఆ మార్గం గుండా వెళ్ళకుండా అడ్డుగా బల్లపెట్టారు. ఆ ఇంటి వెనుక వైపు నివాసం ఉంటున్న వేంపాల సూరిబాబు (55) కుటుంబ సభ్యులు దీనిపై తగాదా పడ్డారు. అకస్మాత్తుగా సూరిబాబు కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఆయనకు ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

వాటర్ ప్లాంట్‌లో మోటార్ల చోరీ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లో నేచురల్ ఆయిల్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురయ్యాయి. దీంతో గ్రామంలో వాటర్‌కు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని, దీనిపై పంచాయితీ కార్యదర్శి గంగాధర్ చోరీకి పాల్పడిన వారిని గుర్తించి శరీర తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ శివారులోని బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గొల్లప్రోలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని పోలీసులు అదుపులో తీసుకుని వారి వద్ద రూ.4,020 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

యువతి అదృశ్యంపై శుక్రవారం సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యువతి తల్లి ఉప్పలపాటి అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. ఆమె కుమార్తె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. ఏటుగట్టు రహదారి నిర్మాణం కారణంగా బస్సులు నడవక పోవడంతో రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటుందన్నారు. అక్కడి నుంచే కళాశాలకు వెళ్తుందన్నారు. ఈ నెల 26న రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి నుంచి రాజమహేంద్రవరంలో కళాశాలకు వెళ్లిందన్నారు. తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులను వాకబు చేయగా ఏటువంటి ఆచూకీ లభించలేదన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి - కరప

అదృశ్యమైన కరప బిసి గురుకుల పాఠశాల విద్యార్థి పుల్లేటిగుర్తి చరణ్‌తేజ(11) ఆచూకీని పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లా పెదవాల్తేరుకు చెందిన చరణ్‌తేజ కరప బిసి గురుకుల హాస్టల్లో 6వ తరగతి చదువుతున్నాడు. అతని తల్లితండ్రులు ఈ నెల 27న మధ్యాహ్నం 12.30కి హాస్టల్లో అప్పగించి వెళ్ళి పోయారు. అదేరోజు రాత్రి 7గంటల నుంచి బాలుడు అదృశ్యమయ్యాడని ప్రిన్సిపల్ రామకృష్ణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ టి సునీత కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా చరణ్ తేజ విశాఖలోని తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు తన తల్లికి ఫోన్ చేసి తెలిపాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లి ప్రిన్సిపల్‌కు, పోలీసులకు తెలిపారు.

బెల్ట్ షాపులను నిరోధించాలని ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో బెల్ట్ షాపులు, మద్యం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నందున వెంటనే వీటిని పూర్తిగా నిరోధించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దమ్ముపేటలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ మద్యం మత్తుకు బానిసవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు, రెడ్డి దుర్గాదేవి, వల్లూరి రాజబాబు, దమ్ము వెంకయ్యమ్మ, కోటప్పల నరస, నూకరత్నం, సీత, అప్పలకొండ, పిల్లి ముసలయ్య, కోట బంగారం, దమ్ము నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట చేర్పుపై గెజిట్ విడుదల

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ రెవెన్యూ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేస్తూ గెజిట్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని 30 రోజుల్లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రౌతులపూడి

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషమైన కృషి చేస్తోందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఎం.కొత్తూరు పంచాయతీ దిగువ దారపల్లి వెళ్లే రహదారి పనులకు శుక్రవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ బద్ది మణి రామారావు, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, కత్తిపూడి మహారాణి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, టిడిపి మండల అధ్యక్షుడు తమరాన సత్యనారాయణ, లాలం కృష్ణవేణి, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, తహశీల్దారు నరేష్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి, ఎంపిడిఒ

పరిశుభ్రతలో మహిళలది కీలక పాత్ర

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటి పరిసరాల పరిశుభ్రత విషయంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ కాద హిమ మహేశ్వరి అన్నారు. 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' కార్యక్రమం భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌సి సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, వివోఏలుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి సత్తిబాబు మాట్లాడుతూ మహిళలు సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదు. కుటుంబాల ఆర్థిక వికాసంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఇప్పటివరకు ఎంతో కృషి చేశారు. ఇప్పుడు గ్రామాల పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాల్లోనూ వారు ముందుండాలి అన్నారు. ఇంటింటికి అందజేసిన ప్రత్యేక డబ్బాలలో తడిపొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించడం ద్వారా వర్మి కంపోస్ట్ తయారీ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జగదీశ్వరి, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రీన్ గార్డులు, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-కోటనందూరు

కూటమి ప్రభుత్వంతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్.పేటలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదా అని, అధికారులు ప్రజాప్రతినిధులు పనితీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కోటనందూరు మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశామని, ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని తెలిపారు. తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ అంకమ్మరెడ్డి రమేష్, కూటమి నాయకులు గాడి రాజబాబు, యనమల రాజేష్, వెలగా వెంకట కృష్ణారావు, చిటమూరి శివ, అంకమరెడ్డి బుల్లిబాబు, లగుడు శ్రీరామ్మూర్తి, పెంటకోట భాస్కర సత్యనారాయణ, నెమ్మది సత్యనారాయణ, ఎఒ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదిత్యలో ఎఐ ఔషధావిష్కరణపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం,లోని ఫార్మసీ విభాగం, ఎఐ ఫార్మా క్లబ్ ఆధ్వర్యాన జంతు నమూనా లేకుండా ఔషధ ఆవిష్కరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మలేషియా, కౌలాలంపూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాలయా, ఫార్మసీ ఫ్యాకల్టీ, గ్రాడ్యుయేట్ రీసెర్చ్ అసిస్టెంట్ అనిల్ కుమార్ కనురి హాజరై, ఔషధ రసాయనాల శోషణ, పంపిణీ, జీవక్రియ, విసర్జనలో ఎఐ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో 250 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ కె.స్వప్న

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై ఒక రోజు శిక్షణ

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో థీమ్ ఫైవ్ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ కె.స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ స్థిరత్వం పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించే కార్యక్రమం అని ఆమె అన్నారు. పచ్చదనం పరిశుభ్రతను పెంచడం ద్వారా గ్రామాలు పర్యావరణపరంగా స్థిరంగా ఉండేలా చేయడం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజేంద్ర, వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్లు అజయ్ దుర్గ, రాజశేఖర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైసిపి మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రాగానే మహిళలపై అఘాయిత్యాలకు పచ్చ జెండా ఊపినట్టు కూటమి నేతలు రెచ్చిపోతున్నారన్నారు. సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం మొదలు, గుంటూరు ఎంఎల్ఎ అహ్మద్ నజీర్ వరకు ప్రజాప్రతినిధులే గాడి తప్పి ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. చోటా నేతలు ఒంటరి మహిళలు, స్కూల్ పిల్లలు, కాలేజ్ విద్యార్థినులను లైంగికంగా వేధించడం నిత్యకృత్యంగా మారడం దురదృష్టకరం అన్నారు. ఉపాధి, విద్య, వైద్యం ఇలాంటి అవసరాలకు ప్రజాప్రతినిధులు వారి అనుచరుల వద్దకు వెళ్తున్న మహిళలని లైంగిక వేధింపులకు గురించి చేయడం పరిపాటిగా మారిందన్నారు.

క్రికెట్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థి

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఎస్.మోక్షిత్ శ్రీసాయి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయప్రకాష్ తెలిపారు.కాకినాడలో ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సాయి విశేష క్రీడా నైపుణ్యం కనపరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టులో స్థానం సంపాదించాడన్నారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు గుంటూరు జిల్లా పేరిచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటాడన్నారు. విద్యార్థి మోక్షిత్ శ్రీసాయి, కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, పాఠశాల అకడమిక్ కో ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో ఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్‌ఒ నరసింహ నాయక్

నిమోనియాపై అవగాహనా పోస్టర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

నిమోనియా వ్యాధిని అరికట్టడానికి సాన్స్ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్స్‌ను శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ నరసింహ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రులకు పోస్టర్స్, కరపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం 12 నవంబర్ 2025 నుండి 28 ఫిబ్రవరి 2026 వరకూ జరుగుతుందని తెలిపారు. పిహెచ్‌సిలలో పని చేస్తున్న ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, డాక్టర్లు న్యుమోనియా వ్యాధిని శిశువులలో త్వరగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా 5 ఏళ్ల లోపు పిల్లల మరణాలను నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఒఐసి డాక్టర్ ఐ.ప్రభాకర్, ఇన్‌ఛార్జ్ ఎపిడమాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష, స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.శ్రీనివాసా రావు, డిప్యూటీ డెమో కె.సూర్యచంద్ర రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబు రాజు స్వగృహంలో నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, నూనె రామారావు, పాలకుర్తి శ్రీను, యాళ్ల వీరబాబు, ఆరిఫ్‌ఆలీ, అనివిల్ల శాస్త్రి, బడుగు శ్రీకాంత్, కాకినాడ రామారావు, అరవింద్ పాల్గొన్నారు.

ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ నిర్వహణ

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఎపిఎం పైల సన్యాసిరావు అధ్యక్షతన ఉచిత ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎపిఎం నాన్ ఫామ్ అధికారి పి.విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యాపారాలు చేసుకునేవారికి గుర్తింపు వచ్చే విధంగా ఈ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టు తెలిపారు. చిరు వ్యాపారులకు రుణ సౌకర్యం పొందడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఎవరైనా వ్యాపారాలకు సంబంధించి లోన్స్ కావాలనుకుంటే ఈ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలన్నారు.

ఘన, వ్యర్థ విభజనపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఘన వ్యర్థ విభజన సదస్సు, సామర్థ్య నిర్మాణ శిక్షణ మార్గదర్శకాలపై మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాష్ ఇన్స్టిట్యూట్ అండ్ సాహస్ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన మిషన్ రిసోర్స్ పర్సన్స్‌కు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 ఘన వ్యర్థాల విభజన మార్గదర్శకాలపై ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి పర్యావరణ అనుకూల అంశాలపై దృశ్య ప్రదర్శనలు, నాటక రూపకాలతో వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం జి.భ్రమరాంబ, మేనేజర్ యు.జ్యోతిరాణి, కో ఆర్డినేటర్ సీతారామాంజనేయరాజు, బివి.రావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 13వ వార్డు పరిధిలో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య గ్యాంగ్ వర్క్ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కొట్టి పవన్ కుమార్, బిక్కిన సుబ్బారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకరయ్యపేటలో బాల్య వివాహాలు నిరోధించాలని అవగాహన కల్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎ.మంగాదేవి మాట్లాడుతూ సమాజంలో నేటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల నష్టాలు, అనర్థాలపై ఆమె వివరించారు. ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నిరోధానికి కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు జ్యోతి, మాధవి, ఈశ్వరి, దేవి, పద్మ, అమ్మాజీ, తులసి, గీత, స్నేహలత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం లంక గోవిందరాజు తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన అంతర్ జిల్లాల ఖోఖో ఛాంపియన్షిప్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థిని పాలెపు దేవి జ్యోతి జిల్లా జట్టు మొదటి స్థానం సాధించడంలో విశేష ప్రతిభ కనబరిచిందన్నారు. హ్యాండ్‌బాల్‌లో నాగ తరుణ్, సంతోష్‌ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు.

నూతనంగా ఎన్నికైన యుటిఎఫ్ కార్యవర్గం

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణ యుటిఎఫ్ శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.నాగేశ్వరరావు, కెవివి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.వి. సాయిరాం ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, జిల్లా కార్యదర్శి ఎస్.వీరబాబు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ పీజీ గోపాల్‌రావు పర్యవేక్షణ చేశారు.

అన్న క్యాంటీన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిజిహెచ్ అన్న క్యాంటీన్‌లో కమిషనర్ రాహుల్‌మీనా శుక్రవారం తనిఖీలు చేపట్టారు. క్యాంటీన్ పరిసరాల్లో స్వచ్ఛత, వడ్డించే ప్రాంతం, చేతులు కడుగు ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అల్పాహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. తాగునీరు, ఆహార పదార్థాల నాణ్యత, మౌలిక వసతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభిప్రాయాలను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తెలియజేయొచ్చని తెలిపారు.

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 331 / 2023

బిట్వీన్:
మలపరెడ్డి శ్రీనివాసులు . . . వాది
అండ్:
లమ్మత ఫాల్గుణరావు . . . ప్రతివాది
టు:
ప్రతివాది:
లమ్మత ఫాల్గుణరావు, తండ్రి ధర్మారావు సాకేను డో.నెం. 104-3-294, 2వ వీధి, గణేష్ గుడి ఎదురుగా, గణేషనగర్, శ్రీచైతన్య స్కూల్ వద్ద, మోరంపాడు రాజమండ్రి-533107.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2025వ సం॥ 12వ నెల 18వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజున హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్ష మందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని, మీరు తెలుసుకోవలసినది.

(శ్రీకోర్టు వారి ఉత్తరువుతో)
వాడపల్లి అన్నపూర్ణయ్య
అడ్వకేట్, యలమంచిలి
అనకాపల్లి జిల్లా.
సెల్: 9247159149
యలమంచిలి
తే:28-11-2025

యానాం వార్తలు

పూలేకు నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్

జ్యోతీరావు పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల సమీపంలోని పూలే విగ్రహానికి ఆర్ఎఒ అంకిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు, ఎస్‌పి వరదరాజన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పునీత్ రాజ్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లికృష్ణ సుధాకర్, హంసాని రామలక్ష్మణుడు, కెఎల్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ యువత ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా జాతీయ యువత ఉత్సవం

ప్రజాశక్తి - యానాం

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఐటిఐ కళాశాలలో జాతీయ యువతోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మై భారత్ జిల్లా యువజన అధికారి తిర్రి గోపి పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకనంద ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతోత్సవంలో భాగంగా నిర్వహించిన పెయింటింగ్, డిక్లమేషన్, పోయెట్రీ రైటింగ్, ఫోక్ డాన్స్, ఫోక్ మ్యూజిక్ వంటి పోటీలలో గెలుపొందిన విజేతలను ప్రకటించి బహుమతులు ప్రదానం చేశారు. డిసెంబర్ 7న పుదుచ్చేరిలో నిర్వహించే స్టేట్ లెవెల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రకటించిన విజేతలు పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్ తెలిపారు.

డైరెక్టర్ అర్జున్ రామకష్ణన్‌తో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

ఆది ద్రావిడ వెల్ఫేర్ డైరెక్టర్‌తో ఎంఎల్ఎ భేటీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఆది ద్రావిడ వెల్ఫేర్ డైరెక్టర్ అర్జున్ రామకృష్ణన్‌తో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆ శాఖకు సంబంధించిన పలు అంశాలు చర్చించినట్టు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. జిఒ నెంబర్ 5కి సంబంధించిన ఫైల్ స్టేటస్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఎస్.ఓ.పి.నెం.12/2025

పార్టీలు:-
1. కొత్తపల్లి సావిత్రి
2. కొత్తపల్లి లక్ష్మి
3: బుద్దాల ఉషారాణి ...పిటీషనర్లు

మరియు

1. మెసర్స్ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, (పూర్వం కోరమండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్), రిప్రజెంటెడ్ బై మేనేజర్, కోరమాండల్ హౌస్, డోరునెం.1-2-10, సర్దార్ పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2. గుండా గజ లక్ష్మి, (భర్త) అప్పారావు, హిందువు, వయస్సు63సం॥లు, గృహిణి, ఫ్లాటు నెం.107, సాగర్ రెసిడెన్సీ, ఎ.పి.హెచ్.బి, కోలనీ, మౌలాలి, కుషాయిగుడా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం,
3. కొత్తపల్లి సత్యనారాయణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు61సం॥లు, రిటైర్డ్ ఉద్యోగి, ఫ్లాటు నెం.101, వనస్పతి బ్లాకు, చెంద్రిక విలాస్ అపార్టుమెంటు, శ్రీరామపురం గ్రామం, రాజానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా.
4. కొత్తపల్లి వెంకట రమణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు57సం॥లు, ఉద్యోగి, డోరు నెం.2-42/301, దొర అపార్టుమెంటు, ప్రకాశం వీధి, అల్కాట్ గార్డెన్స్, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరిజిల్లా

...రెస్పాండెంట్లు

పై పిటీషనర్లు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై గ్రంధంలో చనిపోయిన కొత్తపల్లి గెరటయ్య గారి తాలూకు షేర్ సర్టిఫికెట్లుకు పై పిటీషనర్లు వారసులు అని సక్సేషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం దాఖలు చేసిన పై పిటీషను **ది.29-12-2025వ** తేదీ కు పై కోర్టులో వాయిదా అయి వున్నది. కావున పై నెంబరు పిటీషనులో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది.29-12-2025వ** తేదీ ఉదయం **గం॥10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై పిటీషను పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి(రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్
డోర్.నెం.86-11-11/1
రాజమండ్రి వాడ్రేవునగర్,తిలక్‌రోడ్
ది.27-11-2025 రాజమండ్రి

ప్రకటన

In the Court of the Hon'ble Principal Civil Judge (Senior Division) at Rajamahendravaram
S.O.P.No. 10/2025

Between:
Iduru Gayathri Devi - Petitioner
and
Bula Venkata Ramana - Respondent

పైన తెలిపిన పిటీషనర్, (లేటు) హైమావతి గారి చెల్లెలు మరియు రెస్పాండెంట్ (లేటు) హైమావతి గారికి భర్త (లేటు) హైమావతి గారు డైట్ కాలేజ్, బొమ్మూరు రాజమండ్రి నందు పనిచేసేవారు ఆమె అప్పుడు 40,000 వేలు రూపాయలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దవళేశ్వరం బ్రాంచ్, రాజమండ్రి నందు డిపాజిట్ చేసియున్నారు మరియు పోస్టల్ లైఫ్ ఇన్యురెన్స్ నందు లక్ష రూపాయలు (రూ. 1,00,000) పాలసీ తీసుకొనియున్నారు. (లేటు) హైమావతి గారు తన భర్తను (రెస్పాండెంట్) అక్టోబర్ 2016 సంవత్సరము వదిలిపెట్టి వెళ్లిపోయినారు. ఈ విషయం పై కడియం పోలీస్ స్టేషన్, రాజమండ్రి రూరల్ నందు ఉమెన్ మిస్సింగ్ కేస్ నమోదు చేసినారు. సదరు పోలీస్ వారు ది. 11-07-2024 నందు final report file చేస్తు సదరు హైమావతి గారు చట్టప్రకారం చనిపోయినట్లుగా నిర్ధారించారు. రెవెన్యూ శాఖ ది. 28-08-2024 హైమావతి చనిపోయినట్లు Death Certificate మంజూరు చేసినారు. ఆ తరువాత హైమావతి గారి భర్త (రెస్పాండెంట్) వెంకట రమణ గారు పిటీషనర్ గారి కుటుంబముతో సంబంధము లేకుండా జీవించుచున్నారు. మరియు (లేటు) హైమావతి వారి భర్త (రెస్పాండెంట్) వెంకటరమణ గారికి వారి వైవాహిక జీవితంలో పిల్లలు కలుగలేదు. ది. 11-06-2024 బుల్లా వెంకట రమణ (రెస్పాండెంట్) అయిన తన భార్య (లేటు) హైమావతి గారికి సంబంధించిన స్థిర, చరాస్తులు మరియు ఇన్యురెన్స్ క్లెయిమ్స్, బ్యాంక్ డిపాజిట్స్ తన హక్కులు వదులుకొని ఒక బాండ్ రూపంలో వ్రాయించి నోటరీ చేసి పిటీషనర్‌కి అందించారు. కావున ఇట్టి స్థితిలో పైన తెలిపినటువంటి బ్యాంక్ డిపాజిట్ (40,000) మరియు పోస్టల్ ఇన్యురెన్స్ క్లెయిమ్ (1,00,000) వెరశి (1,40,000) ఒక లక్ష నలభైవేలు రాబట్టుకొనుటకు ది. 23-10-2025న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, రాజమండ్రి యందు ఎస్.ఓ.పి.నెం: 10/2025 పిటీషనర్ దావా దాఖలు చేసియున్నారు. (లేటు) హైమావతి గారి వారసురాలుగా పిటీషనర్ గాయత్రి గారు, రెస్పాండెంట్ బి. వెంకట రమణ పైన పై దావా Succession Certificate నిమిత్తము ఎస్.ఓ.పి.నెం: 10/2025 దాఖలు చేయగా కోర్ట్ వారు ది. 09-12-2025కి వాయిదా వేసియున్నారు. సదరు పిటీషన్‌పై ఎవరికైనను అభ్యంతరములు ఉన్న యెడల సదరు పై కోర్ట్‌లో తెలుపు కొనగలరు. లేని యెడలపై పిటీషన్ కోర్ట్ వారు విచారించిపై పిటీషనర్‌ని వారసురాలిగా ప్రకటించగలరని తెలియజేయు చున్నాము.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
ఇట్లు
దివి వరప్రసాద్, అడ్వకేట్
డో.నెం. 21-16-17, పప్పులమిల్లు ఎదురుగా, మధురానగర్, విజయవాడ-11.
సెల్: 9866204872
వాయదా తేదీ: 09-12-2025